


పారిశుద్ధ్యం ఎక్కడ..

బాధ్యత ఎవరిది?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 3 సంచిక -121 శనివారం 17 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

పిల్లల సోషల్ మీడియా భద్రత..



కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు

ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి

ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన

తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం

న్యూ ఢిల్లీఅక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు మిగతాది 2లో...

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు..



1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ

1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య

కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ

పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి పంపులు ఆన్ చేయలేదని ఆరోపణ

జహీరాబాద్‌లో 'హ్యుందాయ్' ఆర్ అండ్ డీ కేంద్రం

కార్ల తయారీ ప్లాంట్ పెట్టండి -'హ్యుందాయ్' యాజమాన్యానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో ఆ సంస్థ గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రం..

త్వరలోనే భూమిపూజకు సిద్ధం -త్వరగా అనుమతులు ఇవ్వాలని అధికారులకు సీఎం ఆదేశం



హైదరాబాద్,అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): రాజధాని హైదరాబాద్‌లో కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని.. హ్యుందాయ్ యాజమాన్యాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇక్కడ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలోని బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది. తెలంగాణను కార్ల తయారీకి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వారికి తెలిపారు. మిగతాది 2లో...

ఉద్రిక్తంగా తిరంగా యాత్ర

భారీ జాతీయ జెండా ఎగురవేత -పోలీసుల నిర్బంధంలో సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే నేహాబోరా



న్యూ ఢిల్లీ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం నాడు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'తిరంగా యాత్ర' పేరుతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు మిగతాది 2లో...


తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పోటెత్తిన లక్షలాది మంది భక్తులు

లక్ష్మీకాసుల మాలతో గరుత్మంతునిపై దర్శనమిచ్చిన మలయప్ప స్వామి

గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల పురవీధులు

భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేసిన టీటీడీ యంత్రాంగం



తిరుమలఅక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన గరుడ వాహన సేవ శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉత్సవాల్లో ఐదో రోజైన ఈ పర్వదినాన, స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపై మలయప్ప స్వామి వారుమిగతాది 2లో...

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ



హైదరాబాద్అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): :కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని మిగతాది 2లో...

రైతులను త్యాగాలు కోరడమా?

: ప్రభుత్వంపై కవిత విమర్శ



హైదరాబాద్,అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ఎల్ నినో ప్రభావం, రాష్ట్రంలో రాబోయే నీటి కొరతను ఎదుర్కోవడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వానికి దూరదృష్టి కొరవడిందని ఆమె ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మిగతాది 2లో...

రాయలసీమలో రణరంగం

పుంగనూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల ఘర్షణ



పుంగనూరుఅక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): అన్నమయ్య జిల్లా పుంగనూరు, రాయచోటిలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల తొలి రోజైన శుక్రవారం వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు పరస్పరం రాళ్లతో దాడులు చేసుకోవడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. అటు రాయచోటిలో వాహనాలకు నిప్పంటించారు. వివరాల్లోకి వెళితే.. వైసీపీ లోక్‌సభా పక్ష నేత, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి పార్టీ అభ్యర్థులతో కలిసి నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.ం మిగతాది 2లో...

సాయికృష్ణ కేసు సీబీఐకి బదిలీ



ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు

బాధితుడి తల్లికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం

రాష్ట్ర పోలీసుల విచారణపై అనుమానాలు వ్యక్తం చేసిన న్యాయస్థానం

పోలీసులే మృతదేహాన్ని మాయం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో తీర్పు

అమరావతిఅక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ టార్చర్ కేసులో ఏపీ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి బదిలీ చేస్తూ నేడు ఉత్తర్వులు జారీ చేసింది. అంతేగాక బాధితుడి తల్లికి నాలుగు వారాల్లోగా మిగతాది 2లో...

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం

'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్

అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు

యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు

2లో.



అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

సాయికృష్ణ కేసు సీబీఐకి బదిలీ

(మొదటి పేజి తరువాయి)

రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

వివరాల్లోకి వెళితే.. కొన్ని నాన్-బెయిలబుల్ వారెంట్ల కేసులో 25 ఏళ్ల సాయికృష్ణను 2026 మే నెలలో మార్కాపురం సమీపంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే, అతడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోగా, ఆ తర్వాత అతని ఆచూకీ గల్లంతైంది. దీంతో సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, మే 6 నుంచి 8 మధ్య కస్టడీలో జరిగిన చిత్రహింసల వల్లే సాయికృష్ణ మరణించినట్లు నిర్ధారించింది. అక్రమ నిర్బంధం, సీసీటీవీ ఫుటేజ్ డిలీట్ చేయడం, మృతదేహాన్ని రహస్యంగా మాయం చేయడం వంటి ఆరోపణలతో అప్పటి సీఐతో సహా పలువురు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసి, చార్జిషీట్ కూడా దాఖలు చేశారు.

అయితే, రాష్ట్ర పోలీసుల విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని, కేసును సీబీఐకి అప్పగించాలని సాయికృష్ణ తల్లితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, సమగ్ర దర్యాప్తు అవసరమని భావించి కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు కూడా ఈ కేసు విచారణను పర్యవేక్షిస్తూ, ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం, సాక్ష్యాలు మాయం కావడంపై ప్రశ్నలు లేవనెత్తడం గమనార్హం.

జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఉద్రిక్తంగా తిరంగా యాత్ర

(మొదటి పేజి తరువాయి)

అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన అరెస్ట్ అయిన కొద్ది నిమిషాలకే, ఈ నిరసనలో పాల్గొనేందుకు వెళుతున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాను, ఇతర వామపక్ష కార్యకర్తలను మండి హౌస్ వద్ద పోలీసులు నిర్బంధించారు. సీజేపీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అరెస్ట్‌కు నిరసనగా అభిజీత్ దీప్కే ఈ 'తిరంగా అసెంబ్లీ'కి పిలుపునిచ్చారు. కన్నాట్ ప్లేస్ వద్దకు చేరుకుని జాతీయ జెండాను ఎగరేయాలని ఆయన ప్రజలను కోరారు. అయితే, ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ అనుమతి లేదని, ఆ ప్రాంతంలో ఇప్పటికే నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని తెలుపుతూ ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఉదయం దీప్కేకు రెండు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ అరెస్టులపై సీజేపీ అధికార ప్రతినిధి మెహర్ పర్వీచా స్పందిస్తూ, "జాతీయ జెండాను ఎక్కడ ఎగరేయాలో నిర్ణయించుకునే హక్కు మాకుంది. దానిపై ఎవరూ ఆంక్షలు విధించకూడదు. కేవలం జెండాను ప్రదర్శించినందుకే మా ఇద్దరు సహచరులను జంతర్ మంతర్ వద్ద అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయినప్పటికీ మేము వెనక్కి తగ్గబోం" అని అన్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం సెంట్రల్ పార్క్ వద్ద నిషేధాజ్ఞలు ఉన్నాయని పోలీసులు జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. అంతేకాకుండా, గతంలో విమానాశ్రయం వద్ద అదుపులోకి తీసుకున్నప్పుడు, ఏడాది పాటు ఎలాంటి ప్రజా అశాంతికి కారణం కాబోమని దీప్కే ఆయన సహచరులు కోర్టు ఎదుట హామీ పత్రం (బాండ్ డౌన్) ఇచ్చారని, ఆ విషయాన్ని కూడా పోలీసులు తమ నోటీసులో గుర్తుచేశారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

(మొదటి పేజి తరువాయి)

విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు.

హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు."ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

జహీరాబాద్‌లో 'హ్యుందాయ్' ఆర్ అండ్ డీ కేంద్రం

(మొదటి పేజి తరువాయి)

కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలూ అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి హ్యుందాయ్ బృందానికి తెలిపిన సీఎం.. డిసెంబరులో నిర్వహించినున్న గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాల్సింగా ఆహ్వానించారు.678 ఎకరాల్లో విడతలవారిగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఆ ప్రాజెక్టు పురోగతి గురించి హ్యుందాయ్ ప్రతినిధులు శుక్రవారం భేటీలో ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే కొద్ది నెలల్లోనే ఆ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్... అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రం ద్వారా హ్యుందాయ్ వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.

రైతులను త్యాగాలు కోరడమా?

(మొదటి పేజి తరువాయి)

మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఎల్ నినో ప్రభావంపై నిపుణులు ఏడాది ప్రారంభంలోనే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, సకాలంలో నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరవు మండలాలను ప్రకటించి కేంద్రానికి నివేదికలు సమర్పించాయని, కానీ తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు రైతులను త్యాగాలు చేయాలని కోరడం దారుణమని ఆమె విమర్శించారు.రాబోయే 10 నెలలు రాష్ట్రం తీవ్ర నీటి కొరతను ఎదుర్కోనుందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు 30 నెలలు గడుస్తున్నా ఇంకా పాత ప్రభుత్వంపై నిందలు వేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000 ఇచ్చే పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, కరవు పరిస్థితుల దృష్ట్యా వారికి జీవిత బీమా సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.ఇదే సమయంలో, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. ఏవైనా ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు జరిగాయా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ, రాష్ట్రంలో మాత్రం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

పిల్లల సోషల్ మీడియా భద్రత.

(మొదటి పేజి తరువాయి)

జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది.

'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు.

కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది.

ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణిస్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు.

తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరిమితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు.

సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.

ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు..

1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

హైదరాబాద్ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

1,000 టీఎంసీల నీరు వృథా చేశారంటూ..

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

ఎల్‌నినోతో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు లేవు

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు.

మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

తిరుమలలో వైభవంగా శ్రీవారి గరుడ సేవ

(మొదటి పేజి తరువాయి)

ప్రత్యేకమైన లక్ష్మీకాసుల హారంతో అలంకృతుడై తిరుమాడ వీధుల్లో విహరించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగితేలారు.

శుక్రవారం రాత్రి 6:30 గంటలకు వాహన సేవ ప్రారంభమైంది. గజరాజుల గంభీర నడకలు, మంగళవాయిద్యాలు, కళాకారుల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదఘోషల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు ముందుకు కదిలారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ "గోవిందా.. గోవిందా.." అంటూ చేసిన జయజయధ్వానాలతో సప్తగిరులు మార్మోగాయి. స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు.



వర్షంలోనూ అచంచల విశ్వాసం

మధ్యాహ్నం నుంచి తిరుమలలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి గ్యాలరీల్లో వేచి ఉండి, గరుత్మంతునిపై ఉన్న తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకున్నారు. వర్షంలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, బాదంపాలు, అల్పాహారం వంటివి అందించి వారిని ఆదుకున్నారు. టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

వైష్ణవ సంప్రదాయంలో గరుడ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పక్షిరాజైన గరుడుడు భగవంతునికి నిత్య సేవకుడు, పరమ భక్తుడు. ఆయనపై స్వామివారు విహరించడం భక్తికి, శరణాగతికి ప్రతీక. గరుడ వాహనంపై ఉన్న స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోయి, జ్ఞాన వైరాగ్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించడం జన్మ ధన్యమైనట్లుగా భక్తులు భావిస్తారు.

ఈ అద్భుతమైన కార్యక్రమంలో తిరుమల జీయర్ స్వాములు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాయలసీమలో రణరంగం

(మొదటి పేజి తరువాయి)

టీడీపీ కార్యకర్తలు తమ కాన్వాయ్‌ను అడ్డుకుని, నామినేషన్ కేంద్రానికి వెళ్లకుండా నిరోధించే ప్రయత్నం చేశారని వైసీపీ ఆరోపించింది. కర్రలు, ఇనుప రాడ్లతో వాహనాలపై దాడి చేశారని, ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపింది. ఈ ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి.

ఈ దాడి తనపై జరిగిన హత్యాయత్నమని వైసీపీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల ప్రక్రియను హింసతో అడ్డుకునేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించింది. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, తమ అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించింది.

ఈ ఘటనపై రాష్ట్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించాలని డిమాండ్ చేసింది. బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, అభ్యర్థులకు భద్రత కల్పించి ప్రశాంతంగా నామినేషన్లు వేసేలా చూడాలని కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రాంతంలో నెలకొన్న రాజకీయ వైరం ఈ ఘర్షణతో మరోసారి బయటపడింది.

అనంతపురం జిల్లా తాడిపత్రిలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఆయన వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు హాజీ బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాల్లోకి వెళ్తే, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పెద్దారెడ్డి తన ప్రత్యర్థి జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గాన్ని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ తరఫున మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ఫయాజ్ బాషాను బరిలోకి దింపుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రత్యర్థి, టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన అనుచరులు తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా బెదిరిస్తున్నారని కేతిరెడ్డి ఆరోపించారు. తనను తాడిపత్రి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, కోర్టు అనుమతితో రావాల్సి వచ్చిందని గుర్తుచేశారు. "నేను వచ్చినప్పటి నుంచి నా చిటికెన వేలు వెంట్రుక కూడా పీకలేకపోయారు. అధికారం శాశ్వతం కాదు, ఈ విషయం ప్రభాకర్ రెడ్డి అనుచరులు, ఆయనకు మద్దతిచ్చే అధికారులు గుర్తుంచుకోవాలి. నాతో పెట్టుకుంటే ప్రతీకారం తీర్చుకుంటా" అని ఆయన గట్టిగా హెచ్చరించారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలన్న అన్నమయ్య జిల్లా ఎస్పీ

పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమైంది. వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి నామినేషన్ కేంద్రానికి రావడం ఘర్షణకు దారితీయడం తెలిసిందే. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి వైసీపీ శ్రేణులు వ్యవహరించాయని, ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ తెలిపారు. దీనిపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జరిగిన ఘటనను వివరించారు."పుంగనూరు మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో ఈరోజు నామినేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో వైసీపీకి చెందిన ఎంపీ మిథున్ రెడ్డి, ఆయన అనుచరులు, అభ్యర్థులు సుమారు 100 మంది తమ నివాసం నుంచి ఆరు వాహనాల్లో నామినేషన్ కేంద్రానికి బయలుదేరారు.

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం, నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలోకి అభ్యర్థి, మరో ఇద్దరు మాత్రమే రావాలి. కానీ, దాన్ని ఉల్లంఘించి, వాహనాలతో అతివేగంగా అక్కడ ఉన్న స్టాపర్లను, గేటును ఢీకొట్టుకుని లోపలికి వచ్చారు.

దీన్ని అక్కడ ఉన్న టీడీపీ అభ్యర్థులు, కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. వెంటనే మా పోలీస్ సిబ్బంది జోక్యం చేసుకుని ఇరు



వర్గాలను చెదరగొట్టారు. అదే సమయంలో, ఒక వాహనం నామినేషన్ కేంద్రంలోకి అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకువచ్చి అక్కడి జనం మీదకు వెళ్ళింది. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. వారిని వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించాం. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మా బలగాలన్నింటినీ అక్కడికి తరలించి, గుంపును చెదరగొట్టాం. ఎంపీ గారిని ఒక గదిలో ఉంచాం. బయట గుంపు మొత్తం చెదిరిపోయిన తర్వాత, ఎంపీని సురక్షిత ప్రాంతానికి పంపించాం.

ఈ సంఘటనలో ఎవరైతే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించారో, వారిని కఠినంగా శిక్షిస్తామని మా పోలీసు శాఖ తరఫున తెలియజేస్తున్నాను. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం" అని ఎస్పీ స్పష్టం చేశారు.

మరోవైపు, ఈ ఘటనపై రాష్ట్ర మంత్రి డీఎస్‌బీవీ స్వామి కూడా తీవ్రంగా స్పందించారు. వైసీపీ శ్రేణుల తీరును ఖండిస్తున్నామని అన్నారు. పుంగనూరులో రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

ఈ సంఘటనతో పుంగనూరులో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

గొడ్డలితో దాడి.. ముగ్గురిపై కేసు

గీసుకొండ/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):
వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు గీసుకొండ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ తెలిపారు.
మండలంలోని నందనాయక్ తండాకు చెందిన అజ్మీరా వెంకటేష్ (33) తమ గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడనే కక్షతో అదే తండాకు చెందిన బూక్యా నాగరాజు, శంకర్, సింహాద్రి గురువారం సాయంత్రం అతనితో గొడవకు దిగినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నాగరాజు గొడ్డలితో వెంకటేష్ తలపై దాడి చేయడంతో గాయమై రక్తస్రావమైనట్లు తెలిపారు. వెంకటేష్ భార్య అనుషను సైతం దూషించి, చేతులతో కొట్టి బెదిరించినట్లు ఫిర్యాదు అందిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

నూతన ఎస్సై ప్రవీణ్‌కు ఉప్పరపల్లి సర్పంచ్ రాజు శుభాకాంక్షలు



వర్ధన్నపేట/ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్ భోగం ప్రవీణ్‌ను ఉప్పరపల్లి గ్రామ సర్పంచ్ సీనపెల్లి రాజు, ఉపసర్పంచ్ ఆగపాటి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి గోక రవి, గోక సంపత్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్ర సాయం కోరిన తుమ్మల

కిషన్‌రెడ్డికి ఎనిమిది అంశాలపై వినతులు



హైదరాబాద్/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన ఎనిమిది అంశాలపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన కిషన్‌రెడ్డి కోల్ ఇండియా ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు.యాదాద్రి థర్మల్ కేంద్రానికి బొగ్గు కేటాయింపు, సత్తుపల్లి బ్లాక్-3 గనిని సింగరేణికి అప్పగించడం, రామగుండం ఎరువుల కర్మాగారంలో సమస్యల పరిష్కారం, కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. సత్తుపల్లికొవ్వూరు, పెనుబల్లికొండపల్లి రైల్వే లైన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పాండురంగాపురంమల్కన్‌గిరి రైల్వే లైన్‌ను సారపాక వరకు త్వరగా పూర్తి చేయాలని కోరారు. వినతులపై సానుకూలంగా స్పందించిన కిషన్‌రెడ్డి సంబంధిత శాఖలతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పరుగు పందెంలో పార్థుకు స్వర్ణం

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానం



సత్తుపల్లి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ఖమ్మం జిల్లా స్థాయి అండర్-16 అథ్లెటిక్స్ పోటీల్లో సత్తుపల్లిలోని మిరాకిల్ మైండ్స్ పాఠశాల విద్యార్థి పార్థు స్వర్ణ పతకం సాధించాడు. ఈ నెల 15న నిర్వహించిన 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా ఛాంపియన్‌గా నిలిచాడు.విద్యార్థి విజయంపై పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ ఎం.రత్నాకర్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు బూరుగు మురళి, కల్యాణి పార్థును అభినందించారు.

గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు ఉండొద్దు..

ప్రతి ఇంటికీ తాగునీరు అందాల్సిందే!



రాయపర్తి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు రాయపర్తి యువ సర్పంచ్ సంతోష్ తెలిపారు. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఏ ఇంటికైనా నీరు సరఫరా కాకపోతే గ్రామ వాటర్‌మ్యాన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నీటి కొరత ముప్పును గుర్తించి ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని, వృథాను అరికట్టాలని కోరారు.తాగునీటితోపాటు పారిశుద్ధ్యం, వీధి దీపాలు, అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ సమస్యలను పరిష్కరిస్తూ, రాయపర్తి మండలంలో తమ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ సంతోష్ పేర్కొన్నారు.

బట్టు అన్నమ్మ జ్ఞాపకార్థం అన్నదానం

మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నవితరణ



మధిర/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): బట్టు అన్నమ్మ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు.బాలస్వామి సతీమణి బట్టు అన్నమ్మ జ్ఞాపకార్థం వారి కుమార్తె వేల్పూరి స్వర్ణకుమారి, మనవరాళ్లు బట్టు ప్రవల్లిక, అంబిత, సాయి జాహ్నవి, శ్వేత, మనవడు వేల్పూరి యశ్వంత్‌తో పాటు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని మానసిక దివ్యాంగ పిల్లలకు అన్నదానం చేశారు.
బట్టు అన్నమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం, ఓదార్పు ప్రసాదించాలని మానసిక దివ్యాంగ పిల్లల తరఫున ప్రార్థిస్తున్నట్లు సేవాసదనం నిర్వాహకులు తెలిపారు. అన్నమ్మ జ్ఞాపకార్థం పిల్లలతో తమ ఆనందాన్ని పంచుకుంటూ అన్నవితరణ చేసిన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు

సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ విభాగం అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్





హసన్‌పర్తి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి 66వ విభాగంలో సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ విభాగం అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పెద్ద చెరువు వద్ద బతుకమ్మ ఆడుకునే స్థలం, విద్యుత్ దీపాల సౌకర్యాలు, గుంతలమయంగా ఉన్న రహదారి, చెట్ల పొదలు, చెన్నంగి చెరువు కట్టను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా హసన్‌పర్తి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ ఆడుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

హైమాస్ట్ దీపాలకు రూ.56 లక్షలు


ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో 50 పనులకు అనుమతులు



ఎల్కతుర్తి/ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.56 లక్షల నిధులు మంజూరయ్యాయి. డీఎంఎఫ్‌టీ 202627 నిధులతో 50 పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పరిపాలనా అనుమతులు జారీ చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, కాలనీలు, పాఠశాలలు, ఆలయాల వద్ద దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పుల్లూరి శ్రీధర్‌రావు, సింగిల్ విండో అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.
ఎల్కతుర్తి మండలంలోని ఆరేపల్లి, చింతలపల్లి, దామెర, దండెపల్లి, ఎల్కతుర్తి, గోపాల్‌పూర్, గుంటూరుపల్లి, జగన్నాథపూర్, జీలుగుల, కేశవాపూర్, కొతులనడుమ, పెంచికలపేట, శాంతినగర్, సూరారం, తిమ్మాపూర్, వల్లభాపూర్, వీరనారాయణపూర్, రామకృష్ణాపూర్ తదితర గ్రామాల్లో దీపాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులతో రాత్రివేళల్లో వెలుతురు పెరగడంతోపాటు ప్రజలకు భద్రత, రాకపోకల సౌకర్యం మెరుగుపడనుంది.

భద్రకాళి అమ్మవారి సేవలో రెండోసారి అవకాశం





వరంగల్ /అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):
చారిత్రక శ్రీ భద్రకాళి దేవస్థానం ధర్మకర్తలుగా రెండోసారి నియమితులైన గాదె శ్రవణ్ కుమార్‌రెడ్డి, మోత్కూరి మయూరి రాము హర్షం వ్యక్తం చేశారు. తమకు మరోసారి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.దేవస్థానం చైర్మన్ శివ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ధర్మకర్తలు పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం, ఆలయ పవిత్రతను, వైభవాన్ని మరింత పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో రెండోసారి బాధ్యతలు అప్పగించిన పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ, అమ్మవారి సేవలో నిబద్ధతతో పనిచేస్తామని వెల్లడించారు.

డాక్టర్ పెరమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

25 ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాలకు సేవలు



ఎల్కతుర్తి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): డాక్టర్ పెరమాండ్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని హనుమకొండ జిల్లా ఎస్సీ విభాగం మాజీ వైస్ చైర్మన్ ఇనుగాల శ్రీనివాస్ కోరారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమన్వయంతో చర్చించి డాక్టర్ పెరమాండ్ల రామకృష్ణకు సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన కృషిని గుర్తించి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. గత 25 ఏళ్లుగా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ విద్య, వైద్య రంగాల్లో ఉచిత సేవలు అందిస్తున్న రామకృష్ణ సేవలు అభినందనీయమని ఇనుగాల శ్రీనివాస్ పేర్కొన్నారు. సమాజానికి ఆయన సేవలు మరింత అవసరమని, తగిన గుర్తింపు కల్పించడం ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్



తల్లాడ/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుమ్మా వలరాజు మనవరాలు భవ్యకు వెంకటేశ్వరరావుతో నిశ్చితార్థ కార్యక్రమం శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కంభంపాడు గ్రామంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గుమ్మా హరి, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త విజయ్, కాంగ్రెస్ నాయకుడు గుమ్మా వలరాజు, యువజన కాంగ్రెస్ నాయకుడు చీకటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట నూతన ఎస్సైకి ఘన సత్కారం



వర్ధన్నపేట/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన భోగం ప్రవీణ్‌ను శుక్రవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు చాడ కర్ణాకర్ మాదిగ, మాదిగ సంక్షేమ పోరాట సమితి మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై భోగం ప్రవీణ్‌కు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.వర్ధన్నపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ చేపట్టే కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని వారు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో ఎస్సై భోగం ప్రవీణ్ విజయవంతంగా ముందుకు సాగాలని వారు అభిలషించారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యం

కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దిశానిర్దేశం

మిర్యాలగూడ/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) పిలుపునిచ్చారు. శుక్రవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆయన ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎన్నికల కార్యాచరణపై సమీక్ష

నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల





కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొని ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

ఎన్నికల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు. పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థికి మద్దతు కూడగట్టడంతోపాటు ఎన్నికల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ చేయాలి- బోడ అనిల్ కుమార్ నాయక్ డిమాండ్

నర్సంపేట/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
నర్సంపేట మండలం గురిజాల గ్రామపంచాయతీ పరిధిలో ఎండిపోయిన వరి పంటను శుక్రవారం రైతులతో కలిసి తెలంగాణ రక్షణ సేన నాయకుడు బోడ అనిల్ కుమార్ నాయక్ పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించి, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఆరు గంటల పాటు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని విమర్శించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలు



ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వర్షపాతం లోటు ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ, రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెంటనే స్పందించి రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన వరి పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి, బాధిత రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించకపోతే రైతులతో కలిసి విద్యుత్ ఉపకేంద్రాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

పేదలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు -బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్

స్టేషన్ ఘన్‌పూర్/ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):
చిల్పూర్ మండలం పతేపూర్ గ్రామంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి మాలోతు రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. పతేపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెలు, పెంకుటిళ్లలో నివసిస్తూ సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు కాలేదని తెలిపారు. నిజమైన పేదలను గుర్తించి ఎలాంటి పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాల పరిస్థితిని అధికారులు



క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు మంజూరు కాని పేదలకు న్యాయం జరిగే వరకు వారి తరఫున ప్రశ్నిస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా కృషి చేస్తామని మాలోతు రమేష్ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పతేపూర్ వైవీ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుగులోత్ ఉమ్లా నాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ బత్తుల రాజన్ బాబు, మండల నాయకులు మారపాక రమేష్, మండల సమన్వయ కమిటీ సభ్యుడు భూక్యా లాలు, గార్లగడ్డ ఇన్‌చార్జి భూక్యా విజయ్, లింగంపల్లి వార్డు సభ్యుడు మేకల రమేష్, బీఆర్ఎస్ నాయకులు గుగులోత్ లాలు, అరవింద్, మోతి, జెపాల్, విజయ్, కళ్యాణ్, అరుణ్, నరేష్, లావుడ్యా రాజు, మహిళా నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

పైపులైన్ల లీకేజీలపై అధికారుల స్పందన ఏదీ?

రూ.20 లక్షల పనుల నాణ్యతపై విచారణ జరపాలని ప్రజల వినతి

తల్లాడ/అక్టోబర్ 16 (జర్నలిస్టు వార్త):
తల్లాడ మండలంలోని పలు ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైన్ల నుంచి నీరు లీకవుతూ వృథాగా పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తల్లాడ, అంబేద్కర్ నగర్, మంగాపురం తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఉన్నప్పటికీ, లీకేజీల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. తాగునీరు వృథా కాకుండా చూడాల్సిన అధికారులు సమస్యను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మండలంలో మిషన్ భగీరథ పనుల పర్యవేక్షణ, పైపులైన్ల మరమ్మతుల విషయంలో సంబంధిత అధికారులు మరింత శ్రద్ధ చూపాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తల్లాడ మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీరబాబు సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉండటం లేదని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారి వివరణ తీసుకోవాల్సి ఉంది. పైపులైన్ల



లీకేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రూ.20 లక్షల పనులపై నాణ్యతా తనిఖీలు చేపట్టాలి అంబేద్కర్ నగర్ వద్ద సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన పనుల నాణ్యతపై స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరుతున్నారు. పనుల అంచనాలు, వినియోగించిన సామగ్రి, నిర్మాణ ప్రమాణాలు, ఖర్చుల వివరాలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడంతో పాటు అంబేద్కర్ నగర్‌లో జరిగిన పనుల నాణ్యతపై సంబంధిత రికార్డుల ఆధారంగా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేదా పనుల్లో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని తల్లాడ మండల ప్రజలు జిల్లా కలెక్టర్లు నుకోరుతున్నారు

కారేపల్లికి ఎన్టీఆర్ విగ్రహాలు

స్వాగతం పలికిన టీడీపీ నాయకులు వనమా వాసు, తాళ్లూరి అప్పారావు



వైరా/ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని కారేపల్లి మండలం భాగ్యనగర్, ఆల్యాతండాల్లో ఏర్పాటు చేయనున్న దివంగత నందమూరి తారకరామారావు విగ్రహాలు కారేపల్లికి చేరుకున్న సందర్భంగా టీడీపీ నాయకులు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వనమా వాసు, తాళ్లూరి అప్పారావు, కొణిజర్ల మండల అధ్యక్షుడు తాత సుధాకర్, వైరా మండల అధ్యక్షుడు సురేందర్, ఏన్కూరు మండల అధ్యక్షుడు జనార్దన్, జూలూరుపాడు మండల అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు నర్సింహారావుతో పాటు నాయకులు పోలూరి రామారావు, దూదిపాళ్ల భాస్కర్‌రావు, డొంకెన రవీంద్ర, మత్రు, శంకర్, హనుమ, గంగారబోయిన శ్రీనివాస్, దుగ్గింపూడి కొండలరావు, ఆళ్ల సత్యనారాయణ, పెద్దమ్మ సత్యం, కోయ శేషయ్య, నాగండ్ల నాగేష్, ఉన్నం నాగేశ్వరరావు, సక్రు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఉత్సవాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సహకారం





రాయపర్తి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం కొండూరు గ్రామంలోని విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఉత్సవాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు ఫౌండేషన్ తరఫున డీజే బాక్స్ సెట్ అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూస మధు, సురేందర్ రాథోడ్, లేతకుల రంగారెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, కర్ర రవీందర్ రెడ్డి, పుల్ల ఎల్లగౌడ్, దేశబోయిన ఉపేందర్, మాలోత్ వసుందర్, సంధి దేవేందర్ రెడ్డి, ఐరెడ్డి వెంకన్న, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, పెండోట శివ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ నాయకుడికి ఆర్థిక సాయం

న్యాయవాది నిమ్మని శేఖర్‌రావు





పర్వతగిరి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడ్లకొండ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరకుడు రవీందర్‌కు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది నిమ్మని శేఖర్‌రావు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అధిక రక్తపోటుతో బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన రవీందర్ ఏకశిల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.
రవీందర్ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలుసుకున్న శేఖర్‌రావు స్పందించి సాయం అందించారు. వైద్య ఖర్చుల కోసం మరింత ఆర్థిక సహాయం అవసరమని కుటుంబ సభ్యులు తెలిపారు. తోటి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మానవతా దృక్పథంతో స్పందించి తమకు తోచినంత సాయం అందించాలని కోరారు. రవీందర్ త్వరగా కోలుకునేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ం

బతుకమ్మ ఉత్సవాలకు ఎమ్మెల్యే నాగరాజుకు ఆహ్వానం



హనుమకొండ/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): కాజీపేటలోని వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ వేదికగా నిర్వహించనున్న బతుకమ్మ, రావణ వధ ఉత్సవాలకు హాజరుకావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును నేషనల్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సాగరిక, రమాకాంత్‌రెడ్డి శుక్రవారం ఆహ్వానించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

చాగల్లులో బతుకమ్మ తల్లి విగ్రహం ఏర్పాటు

దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కౌన్సిలర్ పొన్న రాజేష్



స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు బతుకమ్మ గ్రౌండ్‌లో ఎనిమిదో వార్డు కౌన్సిలర్ పొన్న రాజేష్ దాతల సహకారంతో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. విగ్రహ ఏర్పాటుతో గ్రామస్థులు ఆయనను అభినందించారు.గతేడాది దాతల సహకారంతో విగ్రహాన్ని తీసుకొచ్చామని, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయిందని కౌన్సిలర్ రాజేష్ తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బతుకమ్మ గ్రౌండ్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా మారపాక యాదయ్య

స్టేషన్‌ఘన్‌పూర్/ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ హనుమకొండ జిల్లా కార్యదర్శిగా తాటికొండకు చెందిన మారపాక యాదయ్య నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు వేముల మల్లేశం శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మామిడాల యశస్విని, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వేముల మల్లేశం, సింగపురం ఇందిర, సింగపురం ఇమాన్యుయేల్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.



పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కొల్లూరు ప్రకాశం

స్టేషన్‌ఘన్‌పూర్/ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):



పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కొల్లూరు ప్రకాశం ఎన్నికయ్యారు. నల్గొండలోని బీఎం గార్డెన్స్‌లో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన సంఘం రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నికలు జరిగాయి.ఈ సందర్భంగా ప్రకాశం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, రాంబాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్‌రెడ్డి, రఘుతోపాటు పీఆర్టీయూ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనతోపాటు ఎన్నికైన ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, మురళి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌కు అభినందనలు తెలిపారు.ం

పోలీసుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



వర్ధన్నపేట/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హామీ ఇచ్చారు. వరంగల్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు కొండా కర్ణాకర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం హనుమకొండలోని సుబేదారి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు.పోలీసు సిబ్బందికి రావాల్సిన పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బకాయిలు, అదనపు అలవెన్సులు, సరెండర్ సెలవుల బకాయిలను విడుదల చేయాలని కోరారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే.. పోలీసుల న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని తెలిపారు. సిబ్బంది సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు నరేష్, మహేందర్ యాదవ్, ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా రద్దీ దృష్ట్యా 7 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం: తెలంగాణ ఆర్టీసీ ఎండీ

ఈ నెల 19వ తేదీ వరకు అదనపు బస్సులు

పండుగ అనంతరం రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేసినట్లు వెల్లడి

ప్రత్యేక సర్వీసుల వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబర్లలో సంప్రదించాలని సూచన

అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

దసరా పండుగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ పూట సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తోంది. దసరా రద్దీని దృష్టిలో ఉంచుకుని 7 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వెల్లడించారు.దసరా పర్వదినం సందర్భంగా రద్దీ కొనసాగుతున్న దృష్ట్యా రేపటి నుంచి 19వ తేదీ వరకు అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీ ఎండీ అధికారులను ఆదేశించారు. అలాగే పండుగ అనంతరం సొంత ఊళ్ల నుంచి నగరానికి, ఇతర ప్రాంతాలకు తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.ప్రయాణికులు తమ టికెట్లను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tgsrtcbus.in ద్వారా ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ప్రత్యేక సర్వీసులకు సంబంధించిన ఇతర వివరాల కోసం 040-69440000, 040-23450033 నంబర్లలో కాల్ సెంటర్లను సంప్రదించాలని కోరారు.

బీసీలకు జనాభా ఆధారిత రిజర్వేషన్లు కల్పించాలి

విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో వాటా ఇవ్వాలి.. మద్దెల ఎల్లేష్, నేదునూరి రాజమౌళి

హసన్‌పర్తి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

బీసీలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయంగా దక్కాల్సిన అవకాశాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాజీపేట మండలం మడికొండలో శుక్రవారం గోపనబోయిన నరసమ్మ అధ్యక్షతన నిర్వహించిన బీసీ హక్కుల సాధన సమితి సమావేశంలో వారు మాట్లాడారు. 1931లో బ్రిటిష్ పాలనలో బీసీల జనాభా గణన జరిగినప్పటికీ, స్వాతంత్ర్యం అనంతరం జనాభా ఆధారంగా బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 56 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బడ్జెట్‌లో 50 శాతం నిధులు కేటాయించాలని కోరారు.మండల్ కమిషన్ సిఫారసుల మేరకు ప్రస్తుతం విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా వాటిని పెంచాలని



అన్నారు. చట్టసభలు, స్థానిక సంస్థల్లోనూ బీసీలకు జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేటు రంగంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు.నవంబరు 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర మహాసభలకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గోపనబోయిన సాంబయ్య, నరేష్, సురేష్, రజిత, తొర్రి మల్లయ్య, తొర్రి లచ్చమ్మ, తొర్రి రమేష్, తొర్రి కుమార్, రాధిక, అన్విత, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావానికి ప్రత్యామ్నాయ పంటలే మేలు

ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి

జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

స్టేషన్‌ఘన్‌పూర్/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వరికి బదులుగా శనగ, కంది, పెసర వంటి పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగు చేయాలని కోరారు. శుక్రవారం శివునిపల్లి రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడిపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాలో అక్టోబరు 16 నాటికి సాధారణంగా 800 మి.మీ.



వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 520 మి.మీ. మాత్రమే నమోదైందని తెలిపారు. వర్షపాతంలో లోటు కారణంగా పంటల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బోర్లు, బావుల్లో నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

బత్తాయి, జామ, సీతాఫలం వంటి ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని తెలిపారు. మహిళా రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కూరగాయల సాగు చేపట్టి నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోనీ, ఏడీఏ అపర్ణ, పశుసంవర్ధకశాఖ అధికారి మురళీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, ఏసీపీ భీంశర్మ, ఎంపీడీవో విజయశ్రీ, మండల వ్యవసాయాధికారి కర్ణాకర్, ఇతర శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోతుల బెడదతో బెంబేలు!

విద్యార్థులు, ప్రజలకు తప్పని భయాలు

కార్పొరేటర్ పదవీకాలం ముగియడంతో పట్టించుకునేవారే కరువు!

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై గంగిళ్ల వెంకట్‌రెడ్డి ఆగ్రహం

హసన్‌పర్తి/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

గ్రామంలో సమస్యలు తలెత్తితే పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రజల భద్రతను కాపాడాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 65వ డివిజన్ ఎల్లాపూర్‌లో కోతుల బెడద చూస్తుంటే ఈ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామంలో కోతుల సంచారం పెరిగి ప్రజలు, పాఠశాల విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గంగిళ్ల వెంకట్‌రెడ్డి ఆరోపించారు.

పాఠశాలకు వెళ్లాలంటేనే భయం!

ఎల్లాపూర్‌లోని పాఠశాల పరిసరాల్లో కోతులు తిష్ఠవేసి విద్యార్థులను భయపెడుతున్నాయి. ఎప్పుడు దాడి చేస్తాయోనన్న ఆందోళనతో పిల్లలు పాఠశాలకు



వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో పలువురిపై కోతులు దాడికి యత్నించడంతోపాటు కొందరిని కరిచినట్లు వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఇళ్లపైకి ఎక్కి రేకుల పైకప్పులను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పదవీకాలం ముగియగానే సమస్యలు గాలికి!

కార్పొరేటర్ పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామ సమస్యలను పట్టించుకునే రాజకీయ నాయకులు కరవ-య్యారని వెంకట్‌రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నా మున్సిపల్ అధికారులు కనీసం కోతులను పట్టించే చర్యలు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సమస్య తీవ్రత తెలిసినా స్పందన లేకపోవడం ప్రజల భద్రతపై నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు.

ఇప్పటికైనా స్పందిస్తారా?

కోతుల బెడదతోపాటు వీధికుక్కల సమస్య కూడా గ్రామస్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని వెంకట్‌రెడ్డి తెలిపారు. అధికారులు ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల పరిసరాల్లో కోతులను పట్టించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతోపాటు వీధికుక్కల బెడదను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో అధికారులు ఇకనైనా చొరవ చూపుతారా? అన్నది వేచి చూడాలి.

పారిశుద్ధ్యం ఎక్కడ.. బాధ్యత ఎవరిది?

నర్సంపేట 23వ వార్డులో పేరుకుపోతున్న చెత్తాచెదారం

మురుగు కాలువలు నిండినా పట్టించుకునేవారేరీ?

అధికారులకు విన్నవించినా ఫలితం లేదంటున్న స్థానికులు

నర్సంపేట/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామని చెప్పే మున్సిపల్ యంత్రాంగం. అంతర్గత వార్డుల్లో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలిస్తోందా? ప్రధాన రహదారులకే శుభ్రత పరిమితమైతే, వీధుల్లో పేరుకుపోతున్న చెత్తను తొలగించేదెవరు? నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో పారిశుద్ధ్య పరిస్థితులపై స్థానికులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ఈ ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

వార్డులో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగు కాలువలు పూడుకుపోవడం, దోమల బెడద పెరగడం వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన వార్డు కౌన్సిలర్, సంబంధిత మున్సిపల్ సిబ్బంది తగిన శ్రద్ధ చూపడం లేదని విమర్శిస్తున్నారు.

ప్రధాన రహదారులకే పరిమితమైన శుభ్రత?

ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నా అంతర్గత వార్డుల్లో పరిస్థితి భిన్నంగా ఉందని



స్థానికులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాలకు చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా రావడం లేదని, వచ్చినా పూర్తిస్థాయిలో చెత్తను సేకరించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో చెత్త పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువల్లో మురుగు.. ప్రజలకు ఇక్కట్లు

మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కొనసాగితే ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులు చేసినా పరిష్కారం లేదా?

సమస్యలను పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు, వార్డు కౌన్సిలర్ స్పందన తెలియాల్సి ఉంది.



సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై అధికారిక వివరణ వెలువడితే పరిస్థితిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. పారిశుద్ధ్య నిర్వహణ మున్సిపాలిటీకి నిత్య బాధ్యత. చెత్త సేకరణ, మురుగు కాలువల శుభ్రత, దోమల నివారణ వంటి చర్యలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన అవసరం ఉంది. 23వ వార్డులోని పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు ఉన్నట్లు తేలితే తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణ పరిశుభ్రతపై ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యల పరిష్కారానికి యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన ఎమ్మెల్యే నాగరాజు









వరంగల్/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

గ్రేటర్ వరంగల్ నగరంలోని 56వ డివిజన్ గోపాలపురంలో నిర్వహించిన శ్రీ దుర్గాభవాని మహాన్నదాన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. నవదుర్గ ఉత్సవ కమిటీ, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆర్చ్, శ్రీ రేణుక ఎల్లమ్మ కాలనీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాన్నదానంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, నాయకులు చింత రమేష్, మర్రి ప్రభాకర్, ఐలన్న, కృష్ణమూర్తి, సంధ్య, విజయ్ సూర్య, శ్రీను, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకారంలో కనకదుర్గమ్మ..

దర్శించుకున్న ఎంపీడీవో కిషన్ నాయక్





స్టేషన్‌ఘన్‌పూర్/ అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త): మండలంలోని తాటికొండ గ్రామ శ్రీ కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అర్చకుడు జీడికంటి వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజ, అర్చన, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం కుంకుమపూజ, ప్రత్యేక అర్చనలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.వేలేరు ఎంపీడీవో జి. కిషన్ నాయక్, సీనియర్ అసిస్టెంట్ జి. రవిప్రసాద్‌రావు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు వారికి ఘనస్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పండుగ బుచ్చయ్య, భవాని మాల స్వాములు పండుగ రాజేశ్వర్, పర్శ రాజు, పండుగ సత్తయ్య, పండుగ రవి, అక్కెనపల్లి రాములు, మారపాక నాగరాజు, అక్కెనపల్లి రాకేష్, శ్రీపతి రాజు, నారబోయిన కార్తీక్, చిలువేరు వర్షిత, మొగ్గం ప్రవస్థి, మారపాక మానస (సుబ్బులు), భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

పండగ వెలుగుల వెనుక
పేదింటి కన్నీళ్లు!

సంబరాలు కొందరివి.. అప్పుల భారం మరికొందరిది!

బతుకమ్మ. దసరా. తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు.





ఆడపడుచుల ఆటపాటలు, పూల సోయగాలు, కుటుంబ సభ్యుల కలయికలు, పల్లెల్లో పండగ సందడి. ఇవన్నీ మన సంప్రదాయానికి అద్దం పడతాయి. పండగ వచ్చిందంటే ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి. నేటి పరిస్థితుల్లో ఆ ఆనందం అందరి గడపలకూ చేరుతోందా? ఆర్భాటాల మధ్య పేదవాడి ఇంట్లోని ఆవేదన కనిపిస్తోందా?

పండగల వేళ వీధులు విద్యుత్తు దీపాలతో వెలిగిపోతున్నాయి. మార్కెట్లు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. కొత్త బట్టలు, పిండి వంటలు, పూజా సామగ్రి, ప్రయాణాలు.ఇలా ఖర్చుల జాబితా పెరుగుతోంది. సంపాదన పరిమితంగా ఉండి, నిత్యావసరాల ధరలు భారంగా మారిన కుటుంబాలకు మాత్రం పండగ సంతోషం కంటే ఖర్చుల ఆందోళనే ఎక్కువవుతోంది. రోజువారీ కూలీపై ఆధారపడే కుటుంబాలు పండగ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. బయట పండగ వెలుగులు కనిపిస్తున్నా.కొన్ని పేదింటి గూటిలో ఆర్థిక ఇబ్బందుల చీకట్లు అలుముకుంటున్నాయి.

పండగ ఆనందమా.. ఆర్థిక భారమా?

పండగ అంటే కొత్త బట్టలు కొనాల్సిందేనా? ఖరీదైన కానుకలు ఇవ్వాల్సిందేనా? ఇతరుల ఆర్భాటాలను చూసి మన స్థోమతకు మించి ఖర్చు చేయడం అవసరమా? అనే ప్రశ్నలు ప్రతి కుటుంబం ఆలోచించాల్సినవి. పండగ పేరుతో అప్పులు చేసి, ఆ తర్వాత నెలల తరబడి వాటిని తీర్చలేక ఇబ్బందులు పడితే ఆ సంబరాలకు అర్థం ఏముంటుంది? ఆనందాన్ని పంచాల్సిన పండగ ఆర్థిక ఒత్తిడికి కారణమైతే ఆలోచించాల్సిందే.

పండగ వైభవం ఖర్చులో లేదు. కుటుంబ సభ్యుల కలయికలో ఉంది. ఖరీదైన దుస్తుల్లో లేదు. ఆత్మీయతలో ఉంది. ఆడంబరాల్లో లేదు. ఆప్యాయతలో ఉంది. మన ఆనందం కోసం అప్పుల ఊబిలోకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఉన్నంతలో పండగ చేసుకోవడం, పక్కింటి పేద కుటుంబం కూడా సంతోషంగా ఉండేలా తోడ్పడటం నిజమైన పండగ స్ఫూర్తి. ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అంశాలెన్నో!

పండగల సందర్భంగా ప్రభుత్వాలు అధికారిక వేడుకలు నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సహజం. అయితే అదే సమయంలో సామాన్య కుటుంబాల జీవన వ్యయంపై కూడా దృష్టి సారించాలి. నిత్యావసర ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పండగ వేళలలో పేద కుటుంబాలకు అవసరమైన సహాయం అందేలా స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి.

పండగల పేరుతో ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూడటం కూడా పాలనలో భాగమే. ప్రభుత్వ కార్యక్రమాల వైభవంతో పాటు సామాన్యుడి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా లేదా అన్నదే అభివృద్ధికి నిజమైన కొలమానం. పేదవాడి ఇంట్లో ఆకలి తీరకపోతే, పిల్లలకు అవసరమైన వస్తువులు కొనలేకపోతే, అప్పుల భయంతో కుటుంబం ఆందోళన చెందుతుంటే పండగ సందడి మాత్రమే సమాజ పురోగతికి సూచిక కాలేదు.

పండగ సంతోషాన్ని నింపాలి.. ఖర్చుల భారాన్ని కాదు!

బతుకమ్మ, దసరా పండగలు మనకు నేర్పేది ఐక్యత, ఆత్మీయత, ధైర్యం, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. ఆ స్ఫూర్తి ప్రతి ఇంటికీ చేరాలి. పండగ పేరుతో అనవసర ఖర్చులు తగ్గించుకోవాలి. ఆడంబరాల కంటే ఆత్మీయతకు, పోటీల కంటే పరస్పర సహకారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పేద కుటుంబాల పిల్లల ముఖాల్లో చిరునవ్వు పూయించే ప్రయత్నం చేయాలి.


పాలకులు కూడా పండగల సందర్భంగా ప్రజల జీవన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి. పండగ వెలుగులు ధనికుల ఇళ్లకే పరిమితం కాకూడదు. ప్రతి పేదింటా ఆనందం వెల్లివిరిసినప్పుడే పండగకు పరిపూర్ణత చేకూరుతుంది.

ప్రజలు ఆలోచించాలి. ప్రభుత్వం స్పందించాలి. పండగ అంటే ఖర్చుల పోటీ కాదు.సంతోషాన్ని పంచుకునే సందర్భం. పేదవాడి కంట కన్నీరు లేకుండా, ప్రతి ఇంటా చిరునవ్వు కనిపించినప్పుడే బతుకమ్మ, దసరా పండగల అసలైన స్ఫూర్తి నెరవేరుతుంది.



జర్నలిస్ట్ వార్త సీ ఈ ఓ సీనియర్
జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
సెల్ ఫోన్ నంబర్ 9701249103

నూతనకల్లులో వైభవంగా అయ్యప్ప ఆలయ ప్రతిష్ఠ





తల్లాడ/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

మండలంలోని నూతనకల్లు గ్రామంలో హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, తెలంగాణ శాసనసభ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ముఖ్య అతిథులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ గ్రామానికి శుభపరిణామమని, స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పరిసర గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్..

నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రం ఏర్పాటును అభినందించిన సీఎం చంద్రబాబు

సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు

తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ అని కొనియాడారు

విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి

ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష



విజయవాడఅక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త):

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. “ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది“ అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు. కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్యా, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. ‘సంజీవని మొబైల్ క్లినిక్స్‘ ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు.

ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



బీజేపీ ఎమ్మెల్సీ రేసులో
వన్నాల రమణ!



హైదరాబాద్ /అక్టోబరు 16(జర్నలిస్ట్ వార్త):ఉమ్మడి వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎవరన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.. కమలం అభ్యర్థి ఎంపికపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో బీసీ సామాజిక సమీకరణాలే బీజేపీ వ్యూహానికి కీలకం కానున్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

ఈ క్రమంలో బీసీ పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ వన్నాల వెంకటరమణ పేరు తెరపైకి వచ్చింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు తనయుడైన వెంకటరమణ విదేశాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసి, ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. సంఘ్ నేపథ్యం, పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర, సేవా కార్యక్రమాలు ఆయనకు అనుకూల అంశాలుగా చర్చకు వస్తున్నాయి.‘వాక్’ ఫౌండేషన్ ద్వారా పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ, అనాథ పిల్లల విద్యకు సాయం, పేదల వైద్య ఖర్చులకు చేయూత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు, మహిళా అభ్యర్థికి అవకాశం ఇవ్వాలనే ఆలోచన వస్తే ఆయన సతీమణి, పీహెచ్‌డీ ప్రొఫెసర్ పాము పావన పేరును పరిశీలించాలనే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం.బీసీ నినాదానికి కట్టుబడతారా? విద్యావంతురాలికి అవకాశం ఇస్తారా? అన్న చర్చ మధ్య డాక్టర్ వన్నాల వెంకటరమణ పేరు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, బీజేపీ అభ్యర్థిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కమలం అధిష్ఠానం నిర్ణయం ఎలా ఉండబోతోందన్నదే ఇప్పుడు ఆసక్తికరం.

కాసుల వర్షం కురిపించే సిరీస్.. విండీస్ బోర్డు ఖాతాలో మాత్రం సున్నా!

భారత్‌కు రూ.285 కోట్ల వరకు ఆదాయం.. వెస్టిండీస్‌కు మాత్రం నయాపైసా దక్కదా?

హైదరాబాద్: భారత్‌వెస్టిండీస్ క్రికెట్ సిరీస్ ద్వారా భారీ ఆదాయం సమకూరుతున్నప్పటికీ, పర్యాటక జట్టు వెస్టిండీస్ క్రికెట్ బోర్డుకు మాత్రం నేరుగా ఎలాంటి ఆదాయం రావడం లేదని ఆ బోర్డు ముఖ్య కార్యనిర్వహణ అధికారి క్రిస్ డెహ్రింగ్ వెల్లడించారు. ప్రస్తుత ద్వైపాక్షిక క్రికెట్ ఆదాయ పంపిణీ విధానంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్‌లో జరుగుతున్న వన్డే, టీ20 సిరీస్‌ల ద్వారా సుమారు 20 నుంచి 30 మిలియన్ డాలర్ల ఆదాయం, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 190 కోట్ల నుంచి రూ. 285 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందని డెహ్రింగ్ పేర్కొన్నారు. అయితే, ఈ ఆదాయంలో వెస్టిండీస్ బోర్డుకు ప్రత్యక్ష వాటా ఉండదని తెలిపారు. **1997లో మారిన ఆదాయ విధానమే కారణం**అంతర్జాతీయ క్రికెట్ ఆదాయ నమూనాలో 1997లో తీసుకొచ్చిన మార్పులే చిన్న క్రికెట్ బోర్డుల ఆర్థిక సమస్యలకు ఒక కారణమని డెహ్రింగ్ అభిప్రాయపడ్డారు. అప్పట్లో విదేశీ పర్యటనలకు వెళ్లే జట్లకు ఆతిథ్య దేశాలు చెల్లించే మొత్తాల ద్వారా కూడా ఆదాయం వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుత విధానంలో ద్వైపాక్షిక సిరీస్‌ల నిర్వహణ, ప్రసార హక్కులు, వాణిజ్య



ఒప్పందాల ద్వారా వచ్చే ఆదాయం ప్రధానంగా ఆతిథ్య దేశ క్రికెట్ బోర్డుకే దక్కుతుంది. **భారత్‌తో పోల్చలేం..** భారత్‌లో క్రికెట్‌కు భారీ ఆదరణ, విస్తృత ప్రేక్షకవర్గం ఉండటంతో ప్రసార హక్కులు, వాణిజ్య ఒప్పందాల ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందని డెహ్రింగ్ పేర్కొన్నారు. అదే వెస్టిండీస్‌లో సిరీస్‌లు నిర్వహించినప్పుడు అంతటి ఆదాయం సమకూరడం కష్టమని వివరించారు. భారత్‌ను తప్పుబట్టడం తన ఉద్దేశం కాదని, చిన్న క్రికెట్ బోర్డులకు ప్రయోజనం కలిగేలా ఆదాయ పంపిణీ విధానాన్ని పునఃపరిశీలించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

తండ్రికి తగ్గ తనయుడు.. 173 పరుగులతో దంచికొట్టిన సెహ్వాగ్ కుమారుడు!



143 బంతుల్లో 19 ఫోర్లు, 8 సిక్సర్లు.. ద్విశతకానికి 27 పరుగుల దూరంలో నిలిచిన ఆర్యవీర్

భారత మాజీ విధ్వంసకర ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుత బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. వినూ మన్‌కడ్ ట్రోఫీ అండర్-19 వన్డే టోర్నీలో ఢిల్లీ జట్టు తరఫున ఆడుతున్న ఆర్యవీర్.. చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో పరుగుల వరద పారించాడు. ఢిల్లీ జట్టుకు నాయకత్వం వహిస్తున్న అతడు 143 బంతుల్లో 173 పరుగులు సాధించి తన బ్యాటింగ్ సత్తాను చాటాడు. **ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడిన ఆర్యవీర్** ఆర్యవీర్ తన ఇన్నింగ్స్‌లో 19 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. మరో ఓపెనర్ ఆర్నవ్ బగ్గాతో కలిసి తొలి వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆర్నవ్ 47 పరుగులు చేసి జట్టు స్కోరుకు తోడ్పడ్డాడు. ఆర్యవీర్ దూకుడైన ఆటతో ఢిల్లీ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 289 పరుగులు సాధించింది. అయితే, ద్విశతకం దిశగా సాగుతున్న అతడి ఇన్నింగ్స్ 46వ ఓవర్‌లో ముగిసింది. **భారీ ఇన్నింగ్స్ ఆడినా తప్పని ఓటమి!**ఆర్యవీర్ అద్భుతంగా ఆడినప్పటికీ ఢిల్లీ జట్టుకు విజయం దక్కలేదు. 290 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చండీగఢ్ జట్టు రూపేశ్ యాదవ్ (167), మీత్ దహియా (63) రాణించడంతో 41.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో చండీగఢ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇటీవల భారత అండర్-19 జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఆర్యవీర్.. ఈ భారీ ఇన్నింగ్స్‌తో మరోసారి వార్తల్లో నిలిచాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ తరహాలో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటూ భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధించే దిశగా అడుగులు వేస్తున్నాడు.



ఐదో టీ20కి ముందు టీమిండియాకు షాక్.. అర్ష్‌దీప్‌కు గాయం, భువనేశ్వర్ ఎంట్రీ!

● నాలుగేళ్ల తర్వాత అంతర్జాతీయ టీ20 జట్టులోకి భువనేశ్వర్ కుమార్.. భారత్‌వెస్టిండీస్ సిరీస్ నిర్ణయాత్మక పోరుపై ఆసక్తి

బెంగళూరు: వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ భుజానికి గాయం కావడంతో అతడి స్థానంలో అనుభవజ్ఞుడైన బౌలర్ భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అక్టోబర్ 16న ప్రకటించింది. **నాలుగేళ్ల తర్వాత జాతీయ జట్టులోకి..**భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022 నవంబర్‌లో భారత్ తరఫున అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడాడు. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత జాతీయ జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం అతడికి లభించింది. స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల భువనేశ్వర్ రాకతో భారత బౌలింగ్ విభాగానికి అనుభవం తోడుకానుంది. **సిరీస్ విజేత ఎవరో తేలేది రేపే!**భారత్, వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 22తో సమంగా ఉంది. చివరి మ్యాచ్ అక్టోబర్ 17న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది.అర్ష్‌దీప్ సింగ్ చివరి మ్యాచ్‌లో ఆడే విషయంపై అతడి కోలుకునే పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ వెల్లడించింది. మరోవైపు, భువనేశ్వర్ కుమార్ తుది జట్టులో చోటు దక్కించుకుంటాడా అనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. స్వింగ్ కింగ్ భువనేశ్వర్ తన పునరాగమనాన్ని విజయంతో ప్రారంభిస్తాడా? సిరీస్ నిర్ణయాత్మక పోరులో టీమిండియా ప్రదర్శన ఎలా ఉంటుందో చూడాలి.



ఇక మంధాన శకం..

జింబాబ్వేతో నేడు భారత్ తొలి టీ20!

- పూర్తిస్థాయి కెప్టెన్‌గా స్మృతి మంధానకు తొలి సవాల్.. విజయంతో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలని భారత మహిళల జట్టు లక్ష్యం

రాయ్‌పూర్: భారత మహిళల క్రికెట్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన పూర్తిస్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ తన తొలి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో జింబాబ్వేతో తలపడనుంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా తొలి పోరు శుక్రవారం రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియంలో జరగనుంది. మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. **జట్టులో కొత్త ఉత్సాహం** మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో స్మృతి మంధానకు పగ్గాలు అప్పగించారు. ఇప్పటికే గతంలో తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించిన అనుభవం ఆమెకు



ఉంది. ఇప్పుడు పూర్తిస్థాయి నాయకురాలిగా జట్టును విజయపథంలో నడిపించడంపై దృష్టి సారించింది. జట్టులో వృత్తిపరమైన క్రమశిక్షణ, ఫీల్డింగ్, దూకుడైన బ్యాటింగ్ ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని మంధాన భావిస్తోంది. **చరిత్ర సృష్టించనున్న భారత్, జింబాబ్వే**భారత మహిళల జట్టు, జింబాబ్వే మహిళల జట్టు తొలిసారిగా ద్వైపాక్షిక అంతర్జాతీయ సిరీస్‌లో తలపడుతున్నాయి. ఈ సిరీస్ ద్వారా యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించనుంది. మరోవైపు, స్వదేశంలో ఆడుతున్న భారత్ బలమైన ప్రదర్శనతో సిరీస్‌ను ప్రారంభించాలని చూస్తోంది.టీ20 సిరీస్ షెడ్యూల్- తొలి టీ20: అక్టోబర్ 16 రాయ్‌పూర్- రెండో టీ20: అక్టోబర్ 18 రాయ్‌పూర్- మూడో టీ20: అక్టోబర్ 20 రాయ్‌పూర్మూడు మ్యాచ్‌లూ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానున్నాయి. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసార వీక్షణ అందుబాటులో ఉంటాయి.



క్రికెట్‌లో సరికొత్త ఫార్మాట్.. ఒకే జట్టులో అమ్మాయిలు, అబ్బాయిలు!

- టెస్ట్ ట్వంటీతో క్రికెట్‌లో కొత్త అధ్యాయం.. ఇద్దరి పరుగులూ కలిపితేనే విజయం। నవంబర్ 14 నుంచి కొలంబోలో తొలి టోర్నీ

కొలంబో: క్రికెట్ ప్రపంచంలో సరికొత్త ఫార్మాట్ అందుబాటులోకి రానుంది. పురుషులు, మహిళలు ఒకే జట్టులో భాగంగా ఉంటూ, వారి ప్రదర్శన ఆధారంగా విజేతను నిర్ణయించే వినూత్న విధానానికి శ్రీకారం చుట్టనున్నారు. 'టెస్ట్ ట్వంటీ' పేరుతో నిర్వహించనున్న ఈ టోర్నీ నవంబర్ 14 నుంచి 29 వరకు శ్రీలంక రాజధాని కొలంబోలో జరగనుంది. క్రికెట్‌లో నాలుగో ఫార్మాట్‌గా నిర్వాహకులు అభివర్ణిస్తున్న ఈ పోటీలకు సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానం వేదిక కానుంది.**ఒకే జట్టు.. రెండు విభాగాలు.. ఉమ్మడి స్కోరు!** ఈ టోర్నీలో ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన 13 నుంచి 21 ఏళ్ల వయసున్న 160 మంది యువ క్రికెటర్లు పాల్గొంటారు. వీరిని నాలుగు జట్లుగా విభజిస్తారు. ఒక్కో జట్టులో 20 మంది అమ్మాయిలు, 20 మంది అబ్బాయిలు ఉంటారు. అమ్మాయిల జట్టు ప్రత్యర్థి అమ్మాయిల జట్టుతో, అబ్బాయిల జట్టు ప్రత్యర్థి అబ్బాయిల జట్టుతో పోటీపడుతుంది. అయితే, రెండు విభాగాల్లో చేసిన పరుగులను కలిపి జట్టు మొత్తం స్కోరుగా పరిగణిస్తారు. ఈ ఉమ్మడి స్కోరు ఆధారంగానే విజేతను నిర్ణయిస్తారు. **80 ఓవర్లు.. రెండు రకాల బంతులు!** టెస్ట్ ట్వంటీ మ్యాచ్ ఒక్క రోజులో 80 ఓవర్ల పాటు సాగుతుంది. తొలి 40 ఓవర్లు పగటి సమయంలో ఎర్ర బంతితో, తెల్ల దుస్తుల్లో ఆడతారు. మిగిలిన 40 ఓవర్లు ఫ్లడ్‌లైట్ల వెలుగులో తెల్ల బంతితో, రంగుల దుస్తుల్లో నిర్వహిస్తారు. తొలి సెషన్‌లో సాధించిన పరుగులు రెండో సెషన్‌లోనూ కొనసాగుతాయి. స్కోరును మళ్లీ సున్నా నుంచి ప్రారంభించే అవకాశం ఉండదు.

ఐదో టీ20లో వైభవ్‌కు ఛాన్స్ ఇవ్వండి!

- యువ సంచలనాన్ని చూడాలని ఆసక్తిగా ఉంది: అభిషేక్ నాయర్



బెంగళూరు: వెస్టిండీస్‌తో జరగనున్న నిర్ణయాత్మక ఐదో టీ20లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కుతుందా? ప్రస్తుతం క్రికెట్ అభిమానుల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ ఆడితే చూడాలని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ఆయన తెలిపారు. **ఓపెనర్‌గానే బరిలోకి దించాలి** వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పిస్తే అతడిని ఓపెనర్‌గా ఆడించాలని నాయర్ సూచించారు. బెంగళూరు వంటి బ్యాటింగ్‌కు అనుకూలమైన మైదానంలో వైభవ్ తన సత్తా చాటగలడని అభిప్రాయపడ్డారు. అయితే, అతడి కోసం బ్యాటింగ్ క్రమాన్ని మార్చడం సరైన నిర్ణయం కాదన్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాటర్ల స్థానాలను మార్చకుండా బౌలింగ్ విభాగంలో మార్పులు చేయడానికే తాను ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. **రాణిస్తున్న అభిషేక్, సంజూ** ప్రస్తుత సిరీస్‌లో భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ తమదైన శైలిలో రాణిస్తున్నారు. అభిషేక్ నాలుగు మ్యాచ్‌ల్లో 139 పరుగులు చేయగా, సంజూ 152 పరుగులతో ఆకట్టుకున్నాడు. అయినప్పటికీ కొన్ని మ్యాచ్‌ల్లో తక్కువ స్కోర్లకే పరిమితం కావడంతో వైభవ్‌కు అవకాశం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది. **సిరీస్ విజేతను తేల్చే పోరు** భారత్, వెస్టిండీస్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 22తో సమంగా ఉంది. శనివారం, అక్టోబర్ 17న బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరిగే చివరి మ్యాచ్‌లో గెలిచిన జట్టుకే సిరీస్ దక్కుతుంది. ఈ కీలక పోరులో వైభవ్‌కు తుది జట్టులో చోటు లభిస్తుందా? లేక మరోసారి బెంచ్‌కే పరిమితమవుతాడా? అనేది ఆసక్తికరంగా మారింది



చూపు తిప్పుకోనివ్వని అందంతో సాయి పల్లవి..

'రామాయణ' ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణ..



దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'రామాయణ'. ఈ భారీ బడ్జెట్ సినిమా అంతర్జాతీయ ట్రైలర్ విడుదల కార్యక్రమం నిన్న బెంగళూరులో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో సీత పాత్రధారి సాయి పల్లవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన పాత్రకు తగ్గట్టుగా, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తూ ఆమె ధరించిన గులాబీ రంగు పట్టుచీర అందరి దృష్టినీ ఆకర్షించింది.

నితీశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా తొలి భాగాన్ని దీపావళి కానుకగా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు చిత్రబృందం మొత్తం హాజరైంది. రాముడి పాత్రలో నటిస్తున్న రణ్‌బీర్ కపూర్, రావణుడిగా యశ్, ఇంకా రవి దూబే, రకుల్ ప్రీత్ సింగ్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ వంటి ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి పల్లవి ప్రత్యేకంగా డిజైన్ చేయించిన గులాబీ రంగు సిల్క్ శారీలో కనిపించారు. చీరపై వెండి జర్దోసీ వర్క్, వెండి బ్రోకేడ్‌తో వృత్తాకార మోటిఫ్‌లు, బోర్డర్ వెంబడి కట్‌వర్క్ డిజైన్ అద్భుతంగా ఉన్నాయి. దానికి సరిపోయేలా మోచేతుల వరకు చేతులున్న బ్లౌజ్‌ను ధరించారు. నగలు కూడా హుందాగా, తక్కువగా ఎంచుకున్నారు. స్టడెడ్ చెవిపోగులు, ఉంగరాలు, చేతికి కొన్ని గాజులతో చాలా అందంగా కనిపించారు.

సహజంగా కనిపించేలా, తక్కువ మేకప్‌తో ఆమె మరింత అందంగా కనిపించారు.వేదికపై సాయి పల్లవి కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. సీత లాంటి పవిత్రమైన పాత్రను పోషించడం ఒక వరం, గొప్ప బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సినిమాపై అంచనాలను మరింత పెంచింది.

'వారణాసి'లో మోస్ట్ కాంప్లెక్స్ మైండ్..

పృథ్వీరాజ్‌కు మహేశ్, జక్కన్న బర్త్ డే విషెస్.. స్పెషల్ ఫొటో రిలీజ్



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న గ్లోబల్ చిత్రం 'వారణాసి' నుంచి ఓ ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్న మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు (అక్టోబర్ 16) సందర్భంగా చిత్రబృందం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ పోషిస్తున్న 'కుంభ' పాత్రకు సంబంధించిన ఓ కీలక విషయాన్ని వెల్లడించింది.

ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థలు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశాయి. రాజమౌళి, పృథ్వీరాజ్ సెట్స్‌లో ఓ సన్నివేశం గురించి సీరియస్‌గా చర్చించుకుంటున్న వర్కింగ్ స్టిల్‌ను పంచుకున్నాయి. "'వారణాసి' ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన మేధస్సు కలిగిన వ్యక్తి.. హ్యాపీ బర్త్ డే కుంభ" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నాయి. ఈ ఒక్క వాక్యంతో సినిమాలోని విలన్ పాత్ర ఎంత శక్తిమంతంగా ఉండబోతుందో చెప్పకనే చెప్పాయి.

మరోవైపు హీరో మహేశ్ బాబు, దర్శకుడు రాజమౌళి కూడా పృథ్వీరాజ్‌కు వ్యక్తిగతంగా బర్త్ డే విషెస్ తెలిపారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు కుంభ. ఈ రోజు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను. మీకు ఎల్లప్పుడూ ప్రేమ, సంతోషం లభించాలని ఆశిస్తున్నాను" అంటూ మహేష్ బాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.దర్శకధీరుడు రాజమౌళి తనదైన శైలిలో పృథ్వీరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, అతని పాత్ర ప్రాధాన్యతను వివరించారు. "హ్యాపీ బర్త్ డే పృథ్వీ. ఈ రోజు నీలో ఉన్న 'కుంభ'ను నిద్రలేపాలని నేను అనుకోలేదు. ప్రపంచంపై తనదైన ముద్ర వేయాలని విధి నిర్ణయించుకున్న వ్యక్తి కుంభ" అని రాజమౌళి రాసుకొచ్చారు. రాజమౌళి పోస్ట్‌తో కథానాయకుడికి ధీటుగా, ఓ బలమైన లక్ష్యంతో ప్రతినాయకుడి పాత్రను తీర్చిదిద్దినట్లు స్పష్టమవుతోంది.ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రంలో వరల్డ్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, క్యారెక్టర్ పోస్టర్లు ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తించాయి. ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై కేఎల్ నారాయణ, కార్తికేయ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.

దేశం విడిచి వెళ్లాలని నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు నోటీసులు..

స్పందించిన జీవిత భాగస్వామి లేఖా వాషింగ్టన్



బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఊహించని షాక్ ఇచ్చింది. అమెరికా పౌరసత్వం కలిగిన ఇమ్రాన్, అక్టోబర్ 28వ తేదీలోగా భారతదేశం విడిచి వెళ్లాలని నోటీసులు జారీ చేసింది. ఇటీవల ముంబైలో జరిగిన సీజేపీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకుగాను ఆయనపై ఈ చర్యలు తీసుకున్నారు. ఈ నోటీసులను బాంబే హైకోర్టులో సవాల్ చేసేందుకు ఇమ్రాన్ ఖాన్ సిద్ధమవుతున్నారు.వివరాల్లోకి వెళితే, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న ముంబైలోని ఆగస్ట్ క్రాంతి మైదానంలో కాక్‌రోచ్ జనతా పార్టీ (జఖో) ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్ ఖాన్ తన భాగస్వామి, నటి లేఖా వాషింగ్టన్, కజిన్ జయాన్ మేరీ ఖాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకుని, అదే రోజు రాత్రి విడుదల చేశారు. అయితే, విదేశీ పౌరసత్వం ఉన్న వ్యక్తి రాజకీయ నిరసనలో పాల్గొనడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని బీజేపీ నేత కిరీట్ సోమయ్య చేసిన ఫిర్యాదు మేరకు ఖీ==ా ఈ నోటీసులు జారీ చేసింది.ఈ పరిణామంపై ఇమ్రాన్ ఖాన్, లేఖా వాషింగ్టన్ సోషల్ మీడియా ద్వారా స్పందించారు. అప్పట్లో పోలీసు వ్యాన్‌లో ఇమ్రాన్‌తో కలిసి దిగిన ఫొటోను ఆమె తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'జస్ట్' అనే క్యాప్షన్‌తో పాటు హార్ట్ ఎమోజీలతో పోస్ట్ చేశారు. గతంలోనూ ఆమె ఈ ఘటనపై స్పందిస్తూ... తాము నిరసనలో పాల్గొనడానికి వెళ్లలేదని, అదుపులోకి తీసుకున్న తమ స్నేహితుల గురించి తెలుసుకోవడానికి వెళ్లామని, ఆ సమయంలో పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించి గాయపరిచారని ఆరోపించారు.


హోటల్ గదికి రమ్మన్నాడు.. ఆ తర్వాత సినిమా నుంచి తీసేశాడు : విద్యా బాలన్

ప్రముఖ బాలీవుడ్ నటి విద్యా బాలన్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఓ చేదు అనుభవం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ దర్శకుడు తనను హోటల్ గదికి రమ్మని బలవంతం చేశాడని, ఆ తర్వాత తనను సినిమా నుంచి తొలగించాడని ఆమె వెల్లడించారు.చెన్నైలో ఓ యాడ్ ఫిల్మ్ షూటింగ్ కోసం వెళ్లినప్పుడు ఈ సంఘటన జరిగిందని విద్యా బాలన్ గుర్తుచేసుకున్నారు. అప్పటికే ఓ సినిమాకు సంతకం చేసిన తాను, ఆ చిత్ర దర్శకుడిని కలవాల్సి వచ్చిందన్నారు. "కాఫీ షాప్‌లో కలుద్దామని నేను చెప్పినా, అతను మాత్రం హోటల్ గదికి వెళ్లి మాట్లాడుకుందామని పదేపదే పట్టుబట్టాడు. అతని ఉద్దేశంపై అనుమానం రావడంతో, గదిలోకి వెళ్లాక నేను సమయస్ఫూర్తితో తలుపు తెరిచే ఉంచాను. దీంతో ఐదు నిమిషాల్లోనే అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు" అని విద్యా బాలన్ వివరించారు.అయితే, ఈ సంఘటన తర్వాత తనను ఆ ప్రాజెక్ట్ నుంచి తొలగించారని ఆమె పేర్కొన్నారు. ఆ దర్శకుడు ఎలాంటి తప్పుడు ప్రతిపాదన చేయనప్పటికీ, అతని ప్రవర్తనలోని ఉద్దేశాన్ని గ్రహించి అలా ప్రవర్తించానని తెలిపారు. ఇది పూర్తిస్థాయి క్యాస్టింగ్ కౌచ్ అనుభవం కాకపోయినా, స్వీయరక్షణ కోసం అప్రమత్తంగా వ్యవహరించానని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమలో తనకు ఇలాంటి సంఘటనలు ఎక్కువగా ఎదురుకాలేదని, ఈ విషయంలో తాను అదృష్టవంతురాలినని విద్యా బాలన్ అన్నారు. ఏ అవకాశం కూడా భద్రతను పణంగా పెట్టేంత పెద్దది కాదని చెప్పారు.



బాక్సాఫీస్ వద్ద 'జైలర్ 2' గర్జన.. తొలిరోజే ర్రికార్డు కలెక్షన్లు!

సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన స్టామినా ఏంటో నిరూపించారు. ఆయన కథానాయకుడిగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జైలర్ 2' చిత్రం నిన్న థియేటర్లలోకి విడుదలైంది. విడుదలై తొలిరోజే వసూళ్ల సునామీ సృష్టించింది. ప్రముఖ ట్రేడ్ వర్గాల ప్రాథమిక అంచనాల ప్రకారం.. ఈ సినిమా మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 125.25 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది. ఇది తమిళ చిత్ర పరిశ్రమలో భారీ ఓపెనింగ్‌గా నిలిచింది.ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ 'శాక్‌నిల్క్' వెల్లడించిన వివరాల ప్రకారం.. 'జైలర్ 2' భారత్‌లో తొలిరోజు రూ. 59.70 కోట్ల నెట్, రూ. 70.25 కోట్ల వసూళ్లను సాధించింది. దేశవ్యాప్తంగా దాదాపు 16,599 షోల ద్వారా ఈ వసూళ్లు రాగా, సగటున 55.4% ఆక్యుపెన్సీ నమోదైంది. మరోవైపు ఓవర్సీస్ మార్కెట్లలోనూ రజినీ మేనియా స్పష్టంగా కనిపించింది. విదేశాల్లో ఈ చిత్రం మొదటి రోజే రూ. 55 కోట్ల గ్రాస్‌ను కలెక్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొత్తం మీద 37 లక్షలకు పైగా ప్రేక్షకులు తొలిరోజే ఈ సినిమాను థియేటర్లలో వీక్షించారు.భాషల వారీగా చూస్తే, తమిళ వెర్షన్ వసూళ్లలో అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క తమిళనాడులోనే 9,326 షోల ద్వారా రూ. 43.35 కోట్ల నెట్ వసూలు చేసి, 70.8% భారీ ఆక్యుపెన్సీని నమోదు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ 'జైలర్ 2'కు ఘన స్వాగతం లభించింది. ఇక్కడ ఈ చిత్రం తొలిరోజు రూ. 12.50 కోట్లు కలెక్ట్ చేసింది. ఇక హిందీలో రూ. 3.50 కోట్లు, కన్నడలో రూ. 0.35 కోట్లు వసూలు చేసింది. అత్యధిక వసూళ్లు సాధించిన రాష్ట్రాల్లో తమిళనాడు తర్వాత కర్ణాటక, ఆంధ్రప్రదేశ్-తెలంగాణ, కేరళ నిలిచాయి.అయితే, ఇటీవల విడుదలైన 'కూలీ', 'లియో' చిత్రాల తొలిరోజు ప్రపంచవ్యాప్త వసూళ్లతో పోలిస్తే 'జైలర్ 2' కాస్త వెనుకబడినప్పటికీ, తమిళ సినీ చరిత్రలో ఇది మూడవ అతిపెద్ద ఓపెనింగ్‌గా నిలిచింది. ప్రస్తుతం వెలువడినవి ప్రాథమిక అంచనాలు మాత్రమేనని, తుది లెక్కల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.



రణబాలి : చరిత్రకు యాక్షన్ తోడు..

విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటించిన చారిత్రక చిత్రం 'రణబాలి'. దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ 1870ల నాటి బ్రిటిష్ పాలన నేపథ్యంలో రాయలసీమ వీరుడి పోరాటాన్ని తెరపై ఆవిష్కరించారు. కరవు వెనుక బ్రిటిష్ అధికారుల దోపిడీని గుర్తించిన రణబాలి, ప్రజల ఆకలి తీర్చేందుకు సాగించే పోరాటమే చిత్ర కథాంశం.విజయ్ దేవరకొండ కొత్త లుక్, నటన ఆకట్టుకుంటాయి. రష్మికతో ఆయన కెమిస్ట్రీ బాగున్నప్పటికీ, రొమాన్స్, భావోద్వేగ సన్నివేశాలు ఆశించిన స్థాయిలో పండలేదు. 1870ల నాటి వాతావరణాన్ని ప్రతిబింబించడంలో దర్శకుడు సఫలమయ్యారు. సినిమాటోగ్రఫీ, యాక్షన్ సన్నివేశాలు మెప్పిస్తాయి. అజయ్‌అతుల్ నేపథ్య సంగీతం ఓ మోస్తరుగా ఉంది. అయితే నెమ్మదైన కథనం, వినోదం లోపించడం, కొన్ని సాగదీసిన సన్నివేశాలు ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. చారిత్రక నేపథ్యం, విజయ్ నటన కోసం చూడదగిన చిత్రమే అయినా, ఆసక్తికరమైన కథనంలో వేగం లోపించడం ప్రతికూలత.



